



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
జనవరి 7, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## కారులో కూర్చుని.. నిప్పంటించుకొని..



- ప్రేమజంట బలవన్మరణం.. ఘట్‌కేసర్‌లో ఘోరం
- ఇద్దరిలో అమ్మాయి మైనర్.. ఐదేళ్లుగా ప్రేమలో..
- స్నేహితుడి నుంచి కారు తీసుకున్న యువకుడు
- లోపల బాలికతో కలిసి ఒంటిపై పెట్రోలు
- కారు దగ్ధం.. గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు
- బంధువులకు వాట్సాపలో సూసైడ్ నోట్

## బిధూరి వ్యాఖ్యలు సంస్కారహీనం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 6 : కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని అవమానించేలా బీజేపీ నేత రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్‌బాబు ఖండించారు. బీజేపీకి మహిళలంటే గౌరవంలేదని ఆయన విమర్శించారు. దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలను చేసిందని, అలాంటి గొప్ప కుటుంబాలకు చెందిన వ్యక్తుల గురించి సంస్కారహీనంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమో బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. అత్యధిక రికార్డు మెజార్టీతో ప్రజలు ఎన్నుకున్న మహిళా ఎంపీపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టేనని అన్నారు. మీడియాలో ప్రచారం, సంచలనాల కోసం గాంధీ కుటుంబంపై వివాదస్పద వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు.



# చర్లపల్లి టెర్మినల్‌తో గణనీయ అభివృద్ధి

### సుస్థిరమైన మౌలిక సదుపాయాలను సృష్టించడంలో ఇదో ముందడుగు

### దేశం 100 శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణకు చేరువవుతోంది

### తెలంగాణ, జమ్మూకశ్మీర్, ఒడిశాల్లో రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: తెలంగాణలోని చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్ స్టేషన్‌ను ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేయడం ద్వారా ఈ ప్రాంతంలో గణనీయ అభివృద్ధి సాకారం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. చర్లపల్లి స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, సౌరశక్తితో నడిచే కార్యకలాపాలతో సహా సుస్థిరమైన మౌలిక ఆధునిక సౌకర్యాలను సృష్టించడంలో ఇది ఒక ముందడుగు అని అన్నారు. ఈ కొత్త టెర్మినల్ సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడలలోని ప్రస్తుత స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు ప్రజలకు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాజెక్ట్‌లు ప్రజల జీవన సౌలభ్యాన్ని పెంపొందించడమే కాకుండా, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యాపారాన్ని సులభతరం చేయడాన్ని ప్రోత్సహిస్తాయని మోదీ ఉద్ఘాటించారు. సమష్టిగా ఈ వృద్ధిని మరింతగా వేగవంతం చేసేందుకు తాను నిశ్చయించుకున్నానని ప్రధాని అన్నారు. చర్లపల్లి న్యూ టెర్మినల్ రైల్వే స్టేషన్‌తో పాటు జమ్మూ రైల్వే డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే రాయగడ రైల్వే డివిజన్ భవనానికి ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. తర్వాత మోదీ మాట్లాడారు. “జమ్మూకశ్మీర్, తెలంగాణ, ఒడిశాలో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభంతో పర్యాటకం

(మిగతా 2వ పేజీలో)




# సహకరించండి

### తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటునందించండి.. మీ లక్ష్యసాధనలో భాగమవుతాం

**బందర్-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్‌హైవే, ప్రత్యేక రైల్వే లైన్, రీజినల్ రింగ్ రైల్, మెట్రో రెండోదశ మంజూరు చేయండి**

**వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ ఏర్పాటుకు అవకాశమివ్వండి.. ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

**చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ.. త్వరలో వందేభారత్ స్లీపర్ రైళ్లు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 6 : “మనదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికాభివృద్ధి సాధించాలన్న మీ లక్ష్యంలో భాగస్వామి అయ్యేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. ఇందుకోసం తెలంగాణ అభివృద్ధికి సంపూర్ణంగా సహకరించండి” అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్రమోదీతో అన్నారు. ఏపీలోని బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ వరకు ప్రత్యేక రైల్వేలైను, ప్రత్యేక గ్రీన్‌ఫీల్డ్ హైవే అత్యంత కీలకమని, ఈ రెండింటినీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్‌రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రైల్‌కు సహకరించాలన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్రానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ఈ ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారం కావాలని అన్నారు. సోమవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా

(మిగతా 2వ పేజీలో)

## ఏసీబీ విచారణకు హాజరుకాకుండానే వెనక్కి..


- న్యాయవాదులతో కలిసి ఏసీబీ కార్యాలయానికి వచ్చిన కేటీఆర్
- లోపలికి ఒక్కరే వెళ్లాలంటూ అడ్డుకున్న పోలీసులు
- తన వెంట న్యాయవాదులు ఉంటే ఇబ్బందేమిటని నిలదీసిన కేటీఆర్
- తాను విచారణకు సహకరిస్తున్నా పోలీసులు అడ్డుకుంటున్నారని మండిపాటు
- అయినా ససేమిరా అన్న పోలీసులు..దాదాపు 40 నిమిషాలపాటు హైడ్రామా
- చివరికి ఏసీబీ ఏఎస్పీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చి వెనుదిరిగిన కేటీఆర్
- ఈనెల 9న విచారణకు రావాలంటూ కేటీఆర్‌కు మరోమారు ఏసీబీ నోటీసులు





## 22న కేసీఆర్ విచారణ!

23, 24తేదీల్లో హరీశ్‌రావు, ఈటల కూడా



## కొత్త ఏడాదిలోనూ భారీగా నియామకాలు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఏడాదిలో 56 వేల కొలువులు భర్తీ చేసినట్లు వెల్లడి**

**జెన్‌కో ఏఈ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ**

హైదరాబాద్: ‘ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే టీజీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసింది. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి జాబ్ కేలండర్ ప్రకటించింది. పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి ఏడాదిలో 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసింది. ప్రతి నెలా ఏదో ఒక నియామక పత్రాలు అందజేస్తున్నాం. నూతన సంవత్సరంలో కూడా పెద్ద ఎత్తున నియామకాలుంటాయి. వాటికి సంబంధించిన నోటిఫికేషన్లు వస్తాయి..’అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో ఏఈ పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు సోమవారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. సచివాలయం ఎదుట ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొలువుల కోసం కొట్లాడిన నిరుద్యోగుల ఆశలను గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు అడియాసలు చేశారని విమర్శించారు. కొలువులు లేక నిరాశ నిస్పృహలకు గురైన నిరుద్యోగ యువత ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ఉద్యోగాలు వస్తాయని భావించి ప్రజా ప్రభుత్వాన్ని

(మిగతా 2వ పేజీలో)

## హెచ్‌ఎంపీవీ కలకలం

- భారత్‌లో ఐదు కేసులు
- బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో వైరస్ బారిన పడ్డ ఐదుగురు శిశువులు
- అందరూ నెలల వయసు చిన్నారులే!
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాం: కేంద్రం
- పాత వైరస్సే.. ఆందోళన అక్కర్లేదు: వైద్యులు
- ప్రతి ఆస్పత్రిలో 20 పడకలు.. సీఎం ఆదేశం




కొద్దిరోజులుగా చైనాను కలవరపెడుతున్న ‘హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ)’.. మన దేశంలోకీ అడుగుపెట్టింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారులు.. గుజరాత్‌లో ఒక శిశువు, చెన్నైలో మరో ఇద్దరు చిన్నారులు ఈ వైరస్ బారిన పడినట్టు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రకటించింది. బెంగళూరులో.. బ్రాంకోన్యుమోనియాతో బాధపడుతున్న మూడు నెలల పాపను ఆస్పత్రిలో చేర్చగా, వైద్య పరీక్షల్లో హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. అయితే, ఆ పాపకు చికిత్స చేసి, డిశ్చార్జి కూడా చేసినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే ఆస్పత్రిలో.. అదే సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల వయసున్న బాబుకు కూడా హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. ఆ బాబుకు చికిత్స చేస్తున్నామని.. ప్రస్తుతం కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. అలాగే.. రాజస్థాన్‌లోని దుంగార్పూర్‌కు చెందిన రెండు నెలల వయసున్న బాబు శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆ శిశువును అహ్మదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. డిసెంబరు 26న ఆ బాలుడికి

(మిగతా 2వ పేజీలో)

# చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ






కాప్రా,వార్త మిర్రర్,డిసెంబర్ 06:దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవంతో మరొక మైలురాయి పడింది.చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను భారత ప్రధాని నరేంద్ర మోదీ నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించి జాతికి అంకితం చేశారు.సాంకేతిక అత్యాధునిక సౌకర్యాలతోరూ 413 కోట్లతో చర్లపల్లి రైల్వే టర్మినల్ ను నిర్మించి సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా పాల్గొని ప్రారంభించారు.కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న,కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్,కిషన్ రెడ్డి,బండి సంజయ్ నేరుగా పాల్గొన్నారు.చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం కావడంతో నేటి నుంచి ఈ రైల్వే టెర్మినల్ లో సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి.నేటి నుంచి ఈ రైల్వే టెర్మినల్ నుంచి 13 జతల రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఢిల్లీ,చెన్నై,విశాఖపట్నం,కోల్ కత్తా రూట్లలో వెళ్లే రైళ్లను చర్లపల్లి మీదుగా నడిపించనున్నట్టు ఇప్పటికే అధికారులు వెల్లడించారు.దేశం 5 ట్రిలియన్ ఎకానమీ సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు భాగస్వామ్యం కావాలన్న ఆకాంక్షకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.దేశంలోని పలు రాష్ట్రాల్లో చేపట్టిన రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి విర్చువల్‌గా ప్రారంభించారు.అందులో భాగంగా చర్లపల్లిలో కొత్తగా నిర్మించిన రైల్వే టెర్మినల్‌ను కూడా ప్రారంభించగా ఆ కార్యక్రమంలో విర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి కేంద్ర వద్ద పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనను ప్రస్తావించి సహకరించాలని ప్రధానమంత్రిని కోరారు. తెలంగాణ మణిహారంగా ఉండే రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు దానివెంట రీజినల్ రింగ్ రోడ్ మెట్రో రైల్ ఫేజ్ -2 విస్తరణ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ,వికారాబాద్ నుంచి కర్నాటక కనెక్టింగ్ రైల్వే లైన్,బందర్ పోర్టు వరకు డెడికేటెడ్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు రైల్వే లైన్ వంటి ప్రతిపాదనలను ప్రధానమంత్రికి వివరించారు.చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి రైల్వే టర్మినల్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవడం పట్ల తెలంగాణ ప్రజల తరఫున ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశాలు.గతంలో హామీ ఇచ్చిన మేరకు ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సత్వరం చేపట్టాలి.తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ లేనందున, హైదరాబాద్ నుంచి బందర్ పోర్టు వరకు ఒక డెడికేటెడ్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమలు, డ్రైపోర్టు అభివృద్ధికి తోడ్పడుతుంది.తెలంగాణలో ఫార్మా ఇండస్ట్రీకు ఎంతో మంచి ప్రాధాన్యత ఉంది. దేశంలో 35% ఫార్మా ఉత్పత్తులు హైదరాబాద్ రాష్ట్రం లోనే ఉత్పత్తి అవుతున్నాయి. అందువల్ల ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే, రవాణా సులబమవుతుంది.ఆటోమొబైల్ పరిశ్రమ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతుంది. ఎలక్ట్రికల్ తయారీ రంగం కూడా ఇక్కడ అభివృద్ధి చెందటానికి అనువుగా ఉంటుంది.హైదరాబాద్ నగరాన్ని చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ ప్రతిపాదనలపై టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది.రీజనల్ రింగ్ రోడ్ నిర్మిస్తే నగరీకరణ జరిగి, ఇది పెట్టుబడులు మరియు పరిశ్రమల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది.మెట్రో రైలు పరంగా దేశంలో ఢిల్లీ తర్వాత తెలంగాణ 2 వ స్థానంలో ఉండగా,గడిచిన పదేళ్లుగా ఈ దిశలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు.దాంతో తెలంగాణ 9 వ స్థానానికి పడిపోయింది.ప్రస్తుతం మెట్రో రైలు ఫేజ్ 2 ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.దాన్ని మంజూరు చేస్తే హైదరాబాద్ నగర అభివృద్ధికి మరిన్ని బాటలు వేసినట్టు అవుతుంది.తెలంగాణ నుంచి కొడంగల్ మీదుగా కర్నాటక రాష్ట్రంతో అనుసంధానం చేసే వికారాబాద్ రైల్వే లైన్ కూడా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. అందుకు సహకరించాలి.తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రస్తావించిన ఈ మూడు నాలుగు అంశాలపై కేంద్ర సహకారం అవసరమని ముఖ్యమంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్,తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ కుమార్,రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్,రైల్వే శాఖ ఉన్నతాధికారులు,స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్,పన్నాల దేవేందర్ రెడ్డి,జేరిపోతుల ప్రభుదాస్ తో పాటు పలు రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు చిన్నారులచే ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.






# చర్లపల్లి టెర్మినల్‌తో గణనీయ అభివృద్ధి

మరింత పెరుగుతుంది. ఈ ప్రాంతాల్లో సామాజిక-ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది" అని అన్నారు.

**త్వరలోనే తొలి బుల్లెట్ రైలు**

"ఇవాళ ప్రజలు ఎక్కువదూరాలను తక్కువ సమయంలో పూర్తిచేయాలనుకుంటున్నారు. అందుకు తగ్గట్లే మేం పనిచేస్తున్నాం. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం చూశాక నాకెంతో సంతోషం కలిగింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. భారతదేశంలో మొదటి బుల్లెట్ రైలు పరుగులు తీసే రోజు కూడా ఎంతో దూరంలో లేదు. రాబోయే రోజుల్లో రైల్వేల ప్రయాణం ఓ గుర్తుండిపోయే మధురస్మృతిగా నిలిచిపోయేలా చేస్తాం. దేశంలో 2014లో 74 ఉన్న విమానాశ్రయాల సంఖ్య నేడు 150కి పైగా పెంచాం. 5 నగరాల నుంచి 21 నగరాలకు మెట్రో సేవలు విస్తరించాం. దేశం కలిసికట్టుగా, అంచెలంచెలుగా ముందుకు సాగుతోందనడానికి ఇలాంటి కార్యక్రమం ఒక నిదర్శనం" అని అన్నారు.

# కరెంటు భారం ఇక ఉండదు!

'స్వర్ణ కుప్పం విజన్-20 29' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించా రు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధిపై పవర్ పా యింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజలను పేదరికం నుం చి బయటపడేసే పీ-4(పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్ట్‌నర్‌షిప్) విధానంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు.

**లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో..**

అనంతరం కుప్పం మండలంలోని నడిమూరులో 'పీఎం సూర్యఘర్' పైలట్ ప్రాజెక్టును చంద్రబాబు ప్రారంభించారు. గ్రామంలో 132 ఇళ్లు ఉండగా.. 96 ఇళ్లను ఈ పథకానికి ఎంపిక చేశారు. 15 ఇళ్లకు సౌర ఫలకాలను అమర్చి సోలరైజేషన్ ప్రారంభించారు. లబ్ధిదారులు సుబ్రమణ్యం, నాగరాజు, పద్మావతి, చిన్నస్వామి ఇళ్లల్లో వాడుతున్న సౌరవిద్యుత్ పనితీరును చంద్రబాబు స్వయంగా పరిశీలించి.. వారి కుటుంబ సభ్యులతో కలిసి టీ తాగారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోలార్ విద్యుత్ పనితీరును వివరించారు. లబ్ధిదారులు, గ్రామస్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. 'సూర్యఘర్ పథకంతో భవిష్యత్‌లో కరెంటు బిల్లు కట్టే భారం ఉండదు. ప్రతి ఇల్లూ నెలకు 200 యూనిట్లు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. మిగులు కరెంటుతో ఏడాదికి రూ.4 వేల ఆదాయం వస్తుంది' అని ఆయన చెప్పారు. జూన్‌లోగా కుప్పానికి హంద్రీ-నీవా జలాలను తీసుకొస్తామన్నారు. ఆ తర్వాత.. నియోజకవర్గాన్ని కాలుష్యరహితంగా తయారుచేసే 'నెట్ జీరో' కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీ ప్రతినిధులతో ఎంవో యూ కుదుర్చుకున్నారు. చీగలపల్లెలో 'ఆర్గానిక్ కుప్పం' కార్యక్రమంలో వ్యవసాయం చేస్తున్న రైతులతో చంద్రబాబు మాట్లాడారు. రాత్రికి ద్రవిడ యూనివర్సిటీకి చేరుకుని టీడీపీ శ్రేణులతో సీఎం సమావేశమయ్యారు.

# కొత్త ఏడాదిలోనూ భారీగా నియామకాలు

తీసుకువచ్చారని అన్నారు. వారి ఆశలు వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం, మంత్రివర్గం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించే విధంగా ఈ నెల 9న తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ%-%2025ని ప్రకటించనున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఇందుకోసం అదనంగా 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. 2030 నాటికి రాష్ట్ర గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 22,448 మెగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేసిందని, ఆ మేరకు విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

**'చెమట చుక్కలకు తర్ఫీదు'లోగో ఆవిష్కరణ**

సింగరేణి సంస్థ రూపొందించిన 'చెమట చుక్కలకు తర్ఫీదు'లోగోను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. దేశ, విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై కోల్ బెల్ట్ యువతకు అవగాహన కల్పించేందుకు సింగరేణి సంస్థ చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం నాయక్ పాల్గొన్నారు.

# కీసరగుట్ట దేవాలయ చైర్మన్‌గా తటాకం నారాయణశర్మ




కీసర,వార్త మిర్రర్,డిసెంబర్ 6:కీసరగుట్ట లోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా నారాయణ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి వంశ పారంపర్యంగా తటాకం వంశస్థులు చైర్మన్గా వ్యవహరిస్తున్నారు.దేవాలయ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని,భక్తులకు, యాత్రికులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, కార్తీకమాసం, శ్రావణమాసం ప్రత్యేక దినాల్లో స్వామి వారి దర్శనార్థం విచ్చేసే లక్షలాది మందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి,మేడ్చల్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా,తటకం రమేష్ శర్మ,తటకం ఉమాపతి శర్మ,తటకం వెంకటేష్ శర్మ,తటాకం శ్రీనివాస్ శర్మ,తటాకం నాగలింగం శర్మ,తటాకం లక్ష్మణ శర్మ స్థానిక నాయకులు పన్నాల బుచ్చిరెడ్డి,మచ్చని జంగయ్య యాదవ్,జలాల్పురం సుధాకర్ రెడ్డి,రాగుల రమేష్,పుట్ట శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 22న కేసీఆర్ విచారణ
## 23, 24తేదీల్లో
## హరీశ్‌రావు, ఈటల కూడా

హైదరాబాద్, జనవరి 6 : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ వైఫల్యాలతోపాటు ఆర్థిక అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈనెల 22వ తేదీన మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించాలని యోచిస్తోంది. ఈనెల 17న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. 18న విచారణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. 20, 21వ తేదీల్లో.. అధికారుల క్రాస్‌ఎగ్జామినేషన్ చేయనున్నారు. 22వ తేదీన విచారణకు హాజరవ్వాల్సిందిగా మాజీ కేసీఆర్‌కు సమన్లు పంపనున్నట్లు సమాచారం. ఒకవేళ కేసీఆర్ తాను నేరుగా రాలేనని, వర్చువల్‌గా హాజరవుతానని కోరినా.. కమిషన్ దానికి సమ్మతించే అవకాశాలున్నాయి. స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిఈ మాజీ ఎస్ఈ మురళీకృష్ణ అమెరికాలో ఉండగా.. ఆయనను కూడా వర్చువల్‌గా విచారించిన విషయం తెలిసిందే..! ఒకవేళ కేసీఆర్ అనారోగ్య సమస్యలను కారణంగా చెబుతూ.. లేఖను రాసినా, దాన్ని ప్రామాణికంగా చేసుకుని, విచారణను కొనసాగించే అవకాశాలున్నట్లు సమాచారం. విద్యుత్తు విచారణ కమిషన్ కూడా ఇదే విధానాన్ని అవలంబించింది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ రాసిన లేఖనే ఆయన అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కాగా.. జస్టిస్ ఘోష్ కమిషన్ కాళేశ్వరం విషయంలో ఈనెల 23న మాజీ మంత్రి హరీశ్‌రావును, 24న ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను విచారించే అవకాశాలున్నాయి. వీరిద్దరూ కూడా క్రాస్ ఎగ్జామినేషన్‌కు కచ్చితంగా హాజరు అవుతారని కమిషన్ భావిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని హెడ్‌వర్క్‌లతోపాటు ఇతర ప్రధాన పనులు జరిగినప్పుడు ఈటల బీఆర్‌ఎసలోనే ఉన్నారు. ఆయనను బీఆర్‌ఎస్ నుంచి పొమ్మనలేక పొగబెట్టారని, ఈటలను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కమిషన్ భావిస్తోంది. ఈటల సంచలన విషయాలను వెల్లడించే అవకాశాలున్నట్లు రాజకీయవర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. కాగా.. 17న హైదరాబాద్ రానున్న జస్టిస్ పీసీఘోష్.. నెలరోజులపాటు ఇక్కడే బస చేస్తారని సమాచారం. ఫిబ్రవరి నెలాఖరులోగా ఆయన ప్రభుత్వానికి నివేదికను సమర్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే..! ఆ బ్యారేజీ నిర్మాణం జరగకున్నా.. పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతిరావు, ఆ పత్రంపై కౌంటర్ సంతకం చేసిన ఎస్ఈ, ప్రస్తుత మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ బి.రమణారెడ్డిపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. కమిషన్ విచారణలో భాగంగా సర్టిఫికెట్లు జారీ చేసిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని ఇదివరకే ప్రశ్నించింది. దీంతో.. ఆ ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ ప్రభుత్వానికి లేఖ రాయడం.. అధికారుల వివరాలన్నీ తీసుకుని.. అభియోగాల నమోదుచేస్తూ నీటిపారుదల శాఖ ఇటీవలే జీవోలను జారీ చేసింది. 17వ తేదీన హైదరాబాద్‌కు రానున్న కమిషన్‌కు అధికారులు ఈ పరిణామాలను నివేదించే అవకాశాలున్నాయి.

# ఏసీబీ విచారణకు హాజరుకాకుండానే వెనక్కి..

హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ల రేసు కేసులో సోమవారం ఏసీబీ కేంద్ర కార్యాలయం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కేటీ రామారావు... ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నా రు. తన న్యాయవాదులను కూడా వెంటతీసుకుని వచ్చారు. కానీ ఏసీబీ కార్యాలయానికి సమీపంలోనే పోలీసులు అడ్డుకున్నారు. ఏసీబీ నోటీసుల ప్రకారం.. న్యాయవాదులకు అనుమతి లేదని, ఒక్కరే విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. న్యాయవాదులు వెంట ఉంటే ఇబ్బంది ఏమిటని, వారిని అనుమతించాలని కేటీఆర్ పట్టుబట్టారు. దాదాపు 40 నిమిషాల పాటు ఏసీబీ కార్యాలయం సమీపంలో తన వాహనంలోనే వేచి ఉన్నారు. చివరికి ఏసీబీ అధికారులకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏసీబీ నోటీసుల ప్రకారం విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు నందినగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరారు. పోలీసులు ఏసీబీ కార్యాలయం సమీపంలో బారికేడ్లు పెట్టి కేటీఆర్ వాహనాన్ని అడ్డుకున్నారు. కేవలం కేటీఆర్ ఒక్కరే ఏసీబీ కార్యాలయంలోకి వెళ్లాలని పేర్కొన్నారు. దీంతో న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరైతే తప్పేమిటని.. న్యాయవాదులను తీసుకురావొద్దని ఏసీబీ అధికారులు కాకుండా పోలీసులు ఎందుకు చెబుతున్నారని కేటీఆర్ నిలదీశారు. అయినా పోలీసులు అనుమతించలేదు. కాసేపు ఏసీబీ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఆ తర్వాత కూడా న్యాయవాదులను అనుమతించేందుకు ససేమిరా అన్నారు. మరోవైపు కేటీఆర్ కూడా పట్టుబట్టి తన వాహనంలోనే కూర్చుని వేచిచూశారు. పలుమార్లు పోలీసులు, కేటీఆర్ మధ్య చర్చలు జరిగినా ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఇలా 40 నిమిషాల పాటు హైడ్రామా చోటు చేసుకుంది. చివరికి న్యాయవాదులు లేకుండా విచారణకు హాజరుకాబోనని, లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చి తిరిగి వెళ్లిపోతానని కేటీఆర్ తేల్చి చెప్పారు. దీనితో ఏసీబీ కేంద్ర కార్యాలయం నుంచి బయటికి వచ్చిన అడిషనల్ ఎస్పీ ఖాన్.. కేటీఆర్ నుంచి లిఖిత పూర్వక సమాధానం తీసుకున్నారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 06 : చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తనంతరం నాయకులు మాట్లాడుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ గ్రామపంచాయతీలో నిధులు లేక సమస్యల కేంద్రాలుగా గ్రామాలు ఉన్నాయని అన్నారు. అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం గ్రామాలపై నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.గ్రామపంచాయతీ నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.గ్రామ సమస్యలను గ్రామపంచాయతీ కార్యదర్శి కి వినతిపత్రం అందించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు బోధస్ వెంకటేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్, నాయకులు మాడగొని మారయ్య, ఎడ్ల నరసింహ, రాగిరి యాదయ్య, పొట్ట సాంబశివులు, పరుసగొని లింగస్వామి,బోదాస్ నరేష్,దొడ్డి రాములమ్మ, పాలమాకుల లక్ష్మమ్మ, వనం విజయకుమార్,



పాలమాకుల రాకేష్, రుద్రగోని మధు, సమ్మిరెడ్డి సత్తిరెడ్డి, అన్నం రాముడు,గంగాదేవి లింగస్వామి,తుపాకుల సాయి, తుపాకుల వినయ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# అంబేద్కర్ భవనం శిథిలావస్థకు చేరుతున్న పట్టించుకోని ప్రభుత్వ అధికారులు

### అంబేద్కర్ భవనాన్ని పట్టించుకోని అధికారులు

### ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలి

### దళిత రత్న డా.బుర్రి వెంకన్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

దేవరకొండ జనవరి 06 వార్త మిర్రర్: ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో దేవరకొండ డివిజన్లో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ శిథిల వ్యవస్థకు చేరుతున్న ప్రభుత్వ ఉన్నతాధికారులకు పట్టింపు లేదని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దళిత రత్న డా. బుర్రి వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాడు పట్టణంలోని అంబేద్కర్ భవనాన్ని పరిశీలించిన ఆయన అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సంఘాలు దళిత బహుజన సమస్యలపై ప్రాతినిధ్యం వహించి సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేసుకోవడం కోసం, పేదింటి పిల్లల పెళ్లిళ్లు శుభకార్యాలు నిర్వహించుకోవడం కోసం భవనం ఉపయోగంలో లేకపోవడం బాధాకరమన్నారు. శుభకార్యాలు నిర్వహించుకోవడం కోసం ఆర్థికంగా వెనుకబడ్డవారు అధిక డబ్బులు చెల్లించి ఫంక్షన్ హాల్లో కార్యాలు చేసుకోలేని పరిస్థితిలో ఈ అంబేద్కర్ భవనం ఉపయోగపడుతుందనుకున్న తరుణంలో ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎన్నో సమస్యలతోటి ప్రారంభించిన కూడా ఆ భవనానికి తాళాలు వేసి గడ్డి మొలిచే విధంగా ఉన్నటువంటి ఈ భవనం దర్శనమిస్తుంది , డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుతో దళితుల ఆర్థిక సామాజిక పరిస్థితులు మెరుగుపడే విధంగా సమావేశాలు సమస్యలు పరిష్కరించుకోవడం కోసం అంబేద్కర్ భవనం పేరుతో భవనాల నిర్మాణం చేసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానపరిచినట్టే నని ఆయన మండిపడ్డారు, భారత రాజ్యాంగంలో అందరికీ సమానత్వం కల్పించినటువంటి ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్.అనే పేరుతో నిర్మించినటువంటి ఈ కమ్యూనిటీ హాల్ గడ్డి మొలుస్తూ శిథిలా వ్యవస్థకు చేరుతున్న గాని ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఏమాత్రం పట్టింపు లేదని.భారత రాజ్యాంగం పైన గౌరవం ఉంచి కమ్యూనిటీ హా ల్ ను ఓపెన్ చేసి



ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు సూచన చేశారు లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెరిక విజయ్ కుమార్ సభ్యులు రామస్వామి.దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదరి ప్రసాద్. వస్కుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ జిల్లా ప్రతినిధి,వార్త మిర్రర్,డిసెంబర్ 06:మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో 413 కోట్లతో నిర్మించిన చర్లపల్లి టెర్మినల్ ను భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించి జాతికి అంకితం చేసారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా ఓడిస్సా,జమ్ము, తెలంగాణ రాష్ట్రాలలో టెర్మినల్స్ ను ప్రారంభించడం ఎంతో హర్షనీయమన్నారు.తెలంగాణలోని హైదరాబాదులో సికింద్రాబాదు, నాంపల్లి, కాచిగూడా లో ఉండే రద్దీ చర్లపల్లి టెర్మినల్ ఏర్పాటు ద్వారా తగ్గుతుందని, అంతేకాకుండా వస్తురవాణా,వాణిజ్యా వ్యాపారానికి ఎంతగానో ఉపయోగపడడమే కాకుండా ఎంతో మందికి జీవనోపాధి, ఉద్యోగ వసతుల కల్పన కలుగుతుందన్నారు.రానున్న రోజుల్లోఈ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్టు దేవ్ వర్మ,కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి,భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్,మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు ఈటెలరాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,మాజీ శాసన సభ్యులు ప్రభాకర్ లు పాల్గొన్నారు.సచివాలయం నుండి తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వర్చువల్ గా పాల్గొని చర్లపల్లి టెర్మినల్ ను ప్రారంభించినందుకు గాను ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణాలో మెట్రొరైల్ విస్తరణకు,ఆర్ ఆర్ ఆర్ నిర్మాణానికి కేంద్రం సహకరించాలని విజ్ఞాప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం,కీసర ఆర్డిఓ సైదులు తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్ జిల్లా తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాప్రా,వార్త మిర్రర్,డిసెంబర్ 06:తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కాల సూచిక(క్యాలెండర్)రాష్ట్ర ధైనందిని (డైరీ)ని సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ కార్మిక శాఖామాత్యులు చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నారు.రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు,రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నల్గొండ-ఖమ్మం- వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జంగిటి కైలాసం చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ రూహీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంబల్ల రాజు,ఉప్పల్ మండల అధ్యక్షులు గణేష్,ప్రధాన కార్యదర్శి బి.సతీష్,శామీర్ పేట నాయకురాలు పి.మంజుల,మేకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి పర్మినల్ వర్చువల్ ప్రారంభించడం అర్షనీయం

### యాదాద్రి రైల్వే స్టేషన్ సుందరీకరణ పనులు ఎప్పుడు మొదలు పెడతారో చెప్పాలి

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు సామాజికవేత్త డా, ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి భక్తులకు (ఎంఎంటిఎస్) సేవలు ఇప్పుడు కొనసాగిస్తారో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య తెలపాలని డిమాండ్ చేశారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి (ఎంఎంటిఎస్) సేవలని, సికింద్రాబాద్ నుంచి యాదాద్రి కి ట్రైన్ సర్వీస్ సేవలను కేంద్ర ప్రభుత్వ 25 కోట్లతో అభివృద్ధి పనులకు 2023లో 7 నెలలో శంకుస్థాపన చేసి, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పాదాల వద్ద ప్రత్యేక పూజ చేసి, ప్రధాని మోడీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా యాదాద్రి రైల్వే స్టేషన్ కు పనులు ప్రారంభించిన, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఎప్పుడు పనులు ప్రారంభిస్తారో తెలపాలి అని డిమాండ్ చేశారు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ బిజెపి నాయకులు ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులతో కృషి చేస్తామని తెలిపారు, భువనగిరి చుట్టూ మరియు యాదాద్రి చుట్టూ శాటిలైట్ టౌన్ షిప్ ఏర్పాటు చేస్తామని, తెలిపిన బిజెపి నాయకులు యాదాద్రి జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు, సామాజికవేత్త, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



## డాక్టర్ రాజారావును సత్కరించిన సన్మానించిన పంబాల

దేవరకొండ జనవరి 06 వార్త మిర్రర్ : బి.ఎస్.పి పార్టీ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్, బహుజన మేధావి ఏకుల రాజారావు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా జాతీయ కాంగ్రెస్ ఎస్సీ. బీసీ. మైనార్టీల కోఆర్డినేటర్ కొప్పుల రాజు సూచనల మేరకు హైద్రాబాద్ విశ్వవిద్యాలయ సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పంబాల పర్వతాలు రాజరావు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ఎస్సీ. ఎస్టీ. బీసీ. మైనార్టీలపై జరుగుతున్న సైతాంతిక దాడిని అడ్డుకోవాల్సిన ఆవశ్యకత గురించి చర్చించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చేస్తున్న కుట్రను బట్టబయలు చేయవలసిన అవసరాన్ని చర్చించారు. రాజ్యంగ ప్రాముఖ్యతను ప్రజలలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు. భవిష్యత్తు తరాల వారు రాజ్యంగ అధ్యయనం ఎందుకు చేయాలి అనే అంశంపై నిర్వహించే కార్యక్రమాల గురించి చర్చించారు. సంస్థాగత స్థాయిలో కాంగ్రెస్ పార్టీ భావజాల వ్యాప్తి, రాజ్యంగ పరిరక్షణ వంటి పలు విషయాలను చర్చించారు.





## మిర్యాలగూడ పట్టణ పరిధిలో 95 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గుర్తింపు

మిర్యాలగూడ జనవరి 6:- (వార్తమిర్రర్) : మిర్యాలగూడ పట్టణం పరిధిలో సుమారు 95 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గుర్తించామని తహసీల్దార్ ఎన్.హరిబాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ 112 ఎకరాల్లో 15 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. సర్వే నంబర్ 5లోని అసైన్డ్ భూమిని కొంత మంది ఆక్రమించారన్న ఆరోపణలపై విచారణ చేస్తున్నామన్నారు. సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయే నిర్వాసితులను గుర్తించాలని సిబ్బందిని కోరినట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఆర్ఐలు టీ. రామకృష్ణ, సత్యనారాయణలున్నారు.



## ట్రినిటీ హైస్కూలో ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన సదస్సు

### చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య

వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 06 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూలో ఆధ్వర్యంలో సోమవారం రోజున పదవ తరగతి విద్యార్థి విద్యార్థులకు చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య ట్రాఫిక్ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధన గురించి వివరించారు. మైనర్లు బైక్ రైడ్ చేయవద్దని అన్నారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ ను విధిగా పాటించాలని రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయరాదు అని చెప్పారు.విద్యార్థులకు మీ తల్లిదండ్రులు మీ పుట్టినరోజు సందర్భంగా మీకు కేక్ కట్ చేయిస్తారు అలాగే నూతన వస్త్రాలు తెస్తారు మీరు మీ డాడీ కి మీ బర్త్ డే గిఫ్ట్ గా హెల్మెట్ కొని ఇవ్వాలని చెప్పారు. అలాగే కార్లో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ వై రామి రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ డి జైపాల్ రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేష్, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు,డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ మంజుల,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## చౌటుప్పల్ ఆదర్శ పాఠశాలకు దరఖాస్తులు ఆహ్వానం

### 6 నుంచి10 తరగతులకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

### ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పి.అజరయ్య



వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 06 : తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశ పరీక్షకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.ఇందులో భాగంగా చౌటుప్పల్ మండల కేంద్రంలోని లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు పొందడానికి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పి.అజరయ్య కోరారు. 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్షను కేటాయించిన పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షల్లో హాజరు కావాలనుకునే విద్యార్థులు జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం చదువుతున్న సంబంధిత పాఠశాల నుంచి బోనఫైడ్, విద్యార్థి పాస్ ఫోటోను విధిగా తీసుకువెళ్లాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 28 వరకు ఉన్నట్లు తెలిపారు.



## సమాచార హక్కు చట్టం రక్షణ సమితి క్యాలెండర్ను ఆవిష్కరించిన ఎస్పీ

అచ్చంపేట జనవరి 06 వార్త మిర్రర్ : ప్రతి పౌరునికి సమాచార హక్కు చట్టం -2005 గురించి తెలియాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నాగర్ కర్నూల్ వైభవ్ గైక్వాడ్ ఎస్పీ అన్నారు.. సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి నూతన క్యాలెండర్ ను నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడానికి అనువైన చట్టమే సమాచార హక్కు చట్టం -2005 అని పారదర్శక జవాబు దారి తనాన్ని ప్రోత్సహించడం అవినీతిని అరికట్టడం పౌరులకు సాధికారత కల్పించడంలో సమాచార హక్కు చట్టం -2005 దోహదపడుతుందని వారు తెలిపారు. అనంతరం సభ్యులు చాలువాతో సత్కరించారు. వారితోపాటు రాష్ట్ర అధ్యక్షులు కుర్ర కిషన్ నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజీమ్ మహమ్మద్ కోశాధికారి ఆనంద్ కార్యవర్గ సభ్యులు ప్రకాష్ మైనుద్దీన్ లు ఉన్నారు..

# మా పల్లెలు నేర్పిన జీవిత పాఠాలు





తిరుమల శంకర్ వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 6 : పొలం గట్లపై నడిపించి, తడబడకుండా నిలదొక్కుకోవటం నేర్పింది. అకాల వర్షాలకు, గాలి దుమారాలకు పంటలు పాడై పోతే, నష్టాలకు నిలదొక్కుకునే స్థైర్యం నేర్పింది. వాగు పక్కన నీటి చెలిమలు తీయించి, శోధించే తత్వం నేర్పింది. సీతాఫలాల కోసం చెట్ల చుట్టూ తిరిగించి, అన్వేషణ నేర్పింది. తుమ్మ ముల్లు, పల్లేరు గాయాల గుచ్ఛులతో, జీవితం పూలపాన్పు కాదని నేర్పింది. వేరుశనగ కాయ కొట్టించి, సోలెడు పల్లీలు తీయించి, ఐదు పైసల సంపాదన నేర్పింది. ఆవులతో, గేదెలతో, కోళ్లతో స్నేహం చేయించి, ప్రాణికోటి పై బాధ్యత పెంచింది, ప్రేమతత్వాన్ని నేర్పింది. రాగడి మట్టితో బండి గిర్రలు చేయించి, మొక్కజొన్న సొప్ప బండ్లకు తొడిగించి, పనితనం నేర్పింది. వేలాడే పిచుక గూళ్ళు, చెట్ల కొమ్మల పంగల మధ్య కొంగ గూళ్ళు చూపించి బొమ్మరిల్లు కట్టించి, చిన్నప్పుడే సివిల్ ఇంజనీరింగ్ నేర్పింది. బతుకమ్మ తంగేడు గునుగు పూల కోసం, తెల్లవారుతూనే పొలం బాట పట్టించి, ఇంటి ఆడబిడ్డల బాధ్యతను నేర్పింది. పొలం పనుల్లో చిన్న చిన్న దెబ్బలు తగిలితే, నల్లాలం ఆకు పసరు పోయించి, చిన్న చిన్న ఇంటి వైద్యం చిట్కాలు నేర్పింది. చెట్టుమీద మామిడికాయ గురిచూసి కొట్టడం, లక్ష్యాన్ని ఛేదించడం నేర్పింది. నిండు బిందెను నెత్తి మీద పెట్టి, నీళ్లు మోయించి, జీవితమంటే బరువు బాధ్యత అని నేర్పింది. కటిక ముడి, దుస్సు ముడులు నేర్పించి పాల శిక్కం కట్టించి, కాగితం పొట్లాలు కట్టటం నేర్పించి చలి కాలంలో అరికంట్లం కట్టించి, ఒడుపు నేర్పింది. బావి నుండి బొక్కెనతో నీళ్లు తోడించి, బాలన్స్ గా బరువు లాగటం నేర్పింది. ఇంటి ముంగిటకు అతిథి దేవతలు, హరిదాసులు గంగిరెద్దులను రప్పించి, ఉన్న దాంట్లో కొంత పంచుకునే గుణం నేర్పింది. ఇసుకలో పిట్ట గూళ్ళు కట్టించి, ఒక ఇంటి వాడివి కావాలి అనే స్పృహను నింపింది. పచ్చపచ్చని నిగనిగలాడే మోదుగాకుల విస్తరిలో, అన్నం అంచులు దాటి కింద పడిపోకుండా తినే ఒద్దికను నేర్పింది. మోదుగాకులు తెంపించి, ఎండబెట్టించి, కట్టలు కట్టించి, విస్తరాకులు కుట్టించి, అతిథులకు ఎంగిలి కాని పాత్రల్లో భోజనం వడ్డించడం నేర్పింది. ఉన్న ఒక్క పిప్పర్మెంట్ ను, అంగీ బట్ట వేసి, కొరికి ముక్కలు చేసి, కాకి ఎంగిలి పేరుతొ దోస్తులతో పంచుకోవటం నేర్పింది. ముళ్ళు గుచ్చుకోకుండా, ఒక్కటొక్కటిగా రేగ్గాయలు తెంపే ఓర్పును నేర్పింది. ఎండా కాలంలో తుమ్మ చెట్ల బంక సేకరణ, స్వయం సంపాదన ధోరణి నేర్పింది. మైదాకును తెంపించి, దంచించి, చేతులకు అద్దించి, వికసించడం చూపించింది. వాయిలి బరిగెలతో, సుతిలి దారంతో విల్లును చేయించి, వస్తు తయారీ మెళకువలు నేర్పింది. అత్తా, మామా, అన్నా వదినా, అమ్మమ్మా, నాయినమ్మా, తాతయ్యా వరుసలతో, ఊరు ఊరంతా ఒక కుటుంబమనే ఆత్మీయత నేర్పింది. మా ఊరు నాకు ఎంత ఇష్టం అంటే, మా అమ్మా, బాపు ఎంత ఇష్టమో, అంత ఇష్టం. ధైర్యంగా బ్రతికే పాఠాలను నేర్పిన మా ఊరుకు పల్లెకు మేము జీవితాంతం రుణపడి ఉంటాం. నేను గ్రామం లో (పల్లెలో) పుట్టి పెరిగాను అని చెప్పటానికి సంతోషపడుతున్నా, గర్వపడుతున్నా..

**- తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి**

## గ్రామ వృద్ధులకు అండగా నిలుస్తూ! 6 సంవత్సరాలుగా

# తన సేవలని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలిచిన వ్యక్తి

### వృద్ధుల చేతికర్ర నిస్తూ.. చలి దుప్పట్లు అందిస్తూ తన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మైనార్టీ నాయకుడు మహమ్మద్ రహీం షరీఫ్







యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం గ్రామంలో 6 సంవత్సరాలుగా గ్రామంలోని వృద్ధులకు చేతి కర్ర సహాయాన్ని అందిస్తూ.! చలికి వణుకుతున్న నిరుపేద వృద్ధులకు దుప్పట్లను అందిస్తూ.! తన సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న మైనార్టీ నాయకులు మహమ్మద్ రహీం షరీఫ్ గ్రామంలో వృద్ధులకు చేతి కర్ర ను అందించాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందని అడిగితే 6 సంవత్సరాల క్రితం గ్రామంలో నా కండ్ల ముందు ఒక వృద్ధుడు చేతి కర్ర సహాయం లేక రోడ్డుపై పడడం చూసి బాధనిపించి అతని లేపి నీకు చేతి కర్ర ఇస్తానని హామీ ఇచ్చాను, వారం రోజుల తర్వాత హైదరాబాద్ నుంచి చేతి కర్ర తీసుకొచ్చి అతని ఇచ్చాను అప్పుడు ఆ వృద్ధుడి కళ్ళల్లో ఆనందం చూసి, గ్రామంలో ఉన్న ప్రతి వృద్ధులకు చేతి కర్ర ఇవ్వాలని సంకల్పంతో ఇప్పటివరకు అందిస్తున్నానని అన్నారు, నా సేవా కార్యక్రమాలను సోషల్ మీడియా , మాధ్యమాల ద్వారా, చూసిన చాలామంది వ్యాపారవేత్తలు, నేను చేసే సహాయాన్ని అభినందించి, నా సేవలు ఇలాగే కొనసాగాలని, నన్ను పిలిపించుకొని ఎన్నో చేతి కర్రలకు దుప్పట్లకు సహాయం చేశారని, చేస్తున్నారని అన్నారు, నా సహాయాన్ని నేను ఇలాగే కొనసాగిస్తూ వృద్ధులకు సహాయంగా నా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు మహమ్మద్ రహీం షరీఫ్

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలి

### సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి

మిర్యాలగూడ, జనవరి 6:-( వార్త మిర్రర్) : డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల సిపిఎం బృందం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించామని అక్కడ అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వం పేదల కోసం డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిందని అందులో 90% నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు రోడ్లు డ్రైనేజీ మంచినీరు కరెంటు సరఫరా లేకపోవడంతో పాటు లబ్ధిదారులు ఎంపిక చేసిన ఇండ్లు పంపిణీ చేయకపోవడంతో ఆ ఇండ్లు శిథిలావస్థలో చేరుకున్నాయని తెలిపారు. ఆ ఇండ్ల వద్ద వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించి, పెండింగ్ పనులు పూర్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించినదని, ఇప్పటికే నిర్మించి ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్నారు. గతంలో గుర్తించిన లబ్ధిదారులకైనా ఇవ్వాలని లేని పక్షంలో కొత్తగా మళ్లీ లబ్ధిదారులను గుర్తించి వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు డా.మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, జిల్లా నాయకులు రవి నాయక్, రాగిరెడ్డి మంగా రెడ్డి, ఆయూబ్, నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, గుణగంటి రాంచంద్రు, కోడి రెక్క మల్లయ్య, లక్ష్మీ నారాయణ, కోన్ రెడ్డి వెంకట్ రెడ్డి, మంద రాజు,శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం:: డా, ర్యాకల శ్రీనివాస్

### 6 గ్యారెంటీలు, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు 365 రోజులు దాటినా అమలు చేయడంలో ఘోర విఫలమైంది అన్నారు, కోతలే లక్ష్యంగా కొన్ని పథకాలను అరకొరగా అమలు చేస్తుంది అన్నారు. ఇప్పటికే రుణమాఫీలో ఎడాపెడా కోతలు పెట్టి, కొన్ని లక్షల మందికి ఎగనామం పెట్టి మొత్తం 42 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, చివరికి 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10,384 కోట్లు రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టింది. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలకు కుదించడం దారుణం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అతిపెద్ద యూటర్న్. 2024లో అసలు రైతుభరోసానే వేయలేదు. అన్నదాతలను వంచనకు గురి చేసిన కాంగ్రెస్ సర్కార్‌కు సరైన బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్





### సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలి ::: సమ్మెకు సిఐటియు మద్దతు

మిర్యాలగూడ జనవరి 6:-( వార్త మిర్రర్) : సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి డిమాండ్ చేశారు. సివిల్ సప్లై ఎఫ్సీఐ గోదాం వద్ద హమాలీలు చేస్తున్న సమ్మెకు సిఐటియు మద్దతు తెలిపినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీల కూలీరెట్లు పెరుగుదలకు కమిషనర్ అంగీకరించి సంవత్సరమవుతున్న ఇంతవరకు జీఓ ఇవ్వలేదని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెరిగిన కూలిరేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు ప్రమాదభీమా 10 లక్షల రూపాయలు కల్పించాలన్నారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే పెంచిన రేట్ల జీఓను విడుదల చేసి హమాలి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దైద దేవయ్య, రామారావు, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ అధ్యక్షులు బాణాల అంజన్రావు, బాలకృష్ణ, కొల వెంకటేశ్వర్లు, పొదిల కృష్ణ పాల్గొన్నారు.



### విద్యార్థుల భద్రత, మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన

మిర్యాలగూడ , జనవరి 6:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ షీ టీమ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణం నండిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత గురించి మాదకద్రవ్యాల వినియోగం వలన జరిగే అనర్థాలను గురించి అవగాహన ఎస్ఐ కె.నరేష్ కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దోసాపటి గణేష్, ఉపాధ్యాయులు వెంకట్రెడ్డి, మెహరాజ్, ఎండీ.వాజీద్, సక్రు, నర్సరాజు, జానయ్య, ప్రమీల, కానిస్టేబుల్ మధు విద్యార్థులు పాల్గొన్నారు.



### ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో జిల్లాలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమ స్థానం

#### సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ జనవరి 6:- (వార్తమిర్రర్) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమ స్థానంలో ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు 95 శాతం పూర్తి చేసి రాష్ట్రంలో నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. మిర్యాలగూడ డివిజన్ లో జరిగిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,50,000 దరఖాస్తులు వాటిని పూర్తి స్థాయిలో 99.5 శాతం విచారణ జరిపి ఆన్ లైన్ చేశారని ఆయన అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.హరిబాబు ఉన్నారు.

### మంత్రివర్గ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

#### ::: కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు దుబ్బాక నవీన్




సంస్థాన్ నారాయణపురం,జనవరి06,( వార్త మిర్రర్) : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో విస్తరించబోయే మంత్రి వర్గంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుబ్బాక నవీన్.తెలంగాణ రాష్ట్రం,మునుగోడు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే రాజగోపాల్ రెడ్డి గారి మంత్రి పదవి ఇస్తే అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయగల సత్తా గల నాయకుడు అంటే రాజగోపాల్ రెడ్డి అన్నారు.గతంలో ఎంపీ గా ఎమ్మెల్యే గాఎమ్మెల్సీ గా అనుభవం ఉన్న గొప్ప నాయకుడు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కితెలంగాణ రాష్ట్ర ప్రజలు మంత్రివర్గంలో మంత్రి పదవి ఇవ్వాలని కోరుకుంటున్నారని దుబ్బాక నవీన్ తెలిపారు.



### మునగాల సుశీలమ్మ దశదినకర్మ కార్యక్రమంలో బి. కే. వై ఎఫ్ కార్యదర్శి మురళీ కృష్ణ యాదవ్

వార్త మిర్రర్, మల్కాజిగిరి : సంస్థాన్ నారాయణపురం మండలం మహమ్మదాబాద్ గ్రామం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మునగాల రమణారెడ్డి నానమ్మ మునగాల సుశీలమ్మ దశదిన కార్యక్రమానికి హాజరైన బి కే యాదవ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బద్దుల మురళీ కృష్ణ యాదవ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సమర సింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లబోత్ సురేష్ యాదవ్, మునగాల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# మూడు బాటిళ్లు..ఆరు గ్లాసులుగా తయారైన బెల్ట్ షాపుల దందా




- మండలంలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు
- పట్టణం పల్లెలు అని తేడా లేకుండా ఏరులై పారుతున్న మద్యం
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు ఎన్నికల సమయంలోనే బెల్ట్ షాపుల పై కేసులా..?
- అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

కల్వకుర్తి జనవరి 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- పట్టణాలు గ్రామాలు అనే తేడా లేకుండా అక్రమ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.ఏ వీధిలో చూసిన బెల్ట్ షాపుల్లే దర్శనమిస్తున్నాయి.కల్వకుర్తి,వివిధ గ్రామాలలో బెల్ట్ షాపుల ద్వారా యువత పెడదారి పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మద్యానికి బానిసైన యువత నేరస్తులుగా మారి పలు కేసుల్లో చిక్కుకుంటున్నారు. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే పలు విమర్శలు ప్రజలలో వ్యక్తం అవుతున్నాయి. ఇష్టారాజ్యంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారి వైపు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలిసిన తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

### పేరుకు మాత్రమే కిరాణం. వెనకాల మొత్తం సిట్టింగే 24/7 మందు

పట్టణాలలో గ్రామాలలో ఉదయం రాత్రి అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి.కొత్తగా ఎక్సైజ్ శాఖ మద్యం పాలసీ తీసుకొచ్చిన యంఆర్‌ఎఫ్ ధరలకే మద్యం విక్రయించేలా కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్ట్ షాప్ ల నిర్వాహకులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఒక్కొక్క గ్రామంలో 5 నుంచి 10 బెల్టు షాపులు ఉన్నాయంటే అక్రమ మద్యం ఏమేరా ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు.నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. గ్రామాలలో కిరాణం పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులు ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి.గ్రామాలలో కూలీలు మద్యానికి బానిసలై పనులకు వెళ్లకుండా బెల్ట్ షాపుల్లోనే తాగుతున్నారు. గ్రామాలలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు.రహదారుల వెంబడి మద్యం విక్రయించవద్దని నిబంధనలు ఉన్న గ్రామాలలో రోడ్ల పక్కనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు.వ్యాపారులు అటు పోలీసులు ఎక్సైజ్ అధికారులు చేతులు తడితే చాలు తమ వ్యాపారాన్ని విరాటకంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వెలువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్న బెల్ట్ షాప్ ల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇప్పటికైనా అబ్కారి శాఖ అధికారులు బెల్టు దుకాణాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించి పుట్టగొడుగుల వెలుస్తున్న బెల్ట్ షాపుల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువత ప్రజలు మద్యానికి బానిస కాకుండా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూద్దాం..

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్






మిర్యాలగూడ, జనవరి 6:-(వార్తమిర్రర్) : మున్సిపల్ పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం(మెప్మా) ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు ఆవరణలో సుందర్ నగర్ కు చెందిన దుర్గాదేవి స్వయం సహాయక సంఘం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత, అర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మెప్మా దుర్గాదేవి స్వయం సహాయక సంఘం క్యాంటీన్ ను మంజూరు చేసిందిని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా నిలిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రారంభించారని అన్నారు. మహిళలు తమ సొంత వ్యాపారాలను ప్రారంభించేందుకు, ఆర్థికంగా స్వతంత్రంగా మారడానికి ప్రోత్సహించడం పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, మెప్మా టీఎంసి భక్కాయ్య, కౌన్సిలర్లు పందిరి అనిత, కొమ్మన నాగలక్ష్మి, స్రవంతి, కాంగ్రెస్ నాయకులు బెజ్జం సాయి, పొదిలా శ్రీనివాస్, ఎం.నర్సిరెడ్డి, చిలుకూరు బాలు, చల్లా వెంకన్న, అమృతరెడ్డి, బి.శ్రీనివాస్, గుడిపాటి నవీన్ పి.శరత్, గిరిధర్, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో అధికారులు, సిబ్బంది నూతనోత్సాహంతో పనిచేయాలి: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

### రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : 2025 నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా నేరేడ్ మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో రాచకొండ డిసిపిలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు మరియు మినిస్టీరియల్ అధికారులు, సిబ్బంది తదితరులతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ సుధీర్ బాబు ఐపీ ఎస్. మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషిచేసినప్పటికీ తగినంత గుర్తింపు లభించని సందర్భాలు కూడా ఉంటాయని, అయినా మన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. అధికారులు మరియు సిబ్బంది వివిధ రకాల సమస్యలతో న్యాయం కోసం స్టేషన్ కు వచ్చే బాధితులతో సహానుభూతితో వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఉన్నతాధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది నూతన క్రిమినల్ చట్టాలను గురించిన సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని, నూతన చట్టాల అమలులో ఎదురవుతున్న అవరోధాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు మరియు సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని దానితోపాటు ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఉద్యోగ బాధ్యతలను మరియు ఉన్నతాధికారులు అప్పగించిన విధులను క్రమశిక్షణతో నిర్వర్తించాలని సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తమ కిందిస్థాయి అధికారులు మరియు సిబ్బందికి మార్గ నిర్దేశనం చేస్తూ క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నాయకత్వం వహించాలని కమిషనర్ సూచించారు. రాచకొండ పరిధిలోని అన్ని స్థాయిల అధికారులు మరియు సిబ్బంది సమిష్టి కృషితోనే గరిష్ట శిక్షా రేటు సాధించగలిగామని, ప్రతి సంవత్సరం నేర నిరూపణ శాతం విషయంలో రాచకొండ కమిషనరేట్ అగ్రభాగాన నిలుస్తుండడం మంచి విషయం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థలకు మరియు పంచాయతీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటినుండే తమ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురుకాకుండా ముందస్తు భద్రతా చర్యలు ఇతర జాగ్రత్త చర్యలు మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ డిసిపిలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, మినిస్టీరియల్ అధికారులు మరియు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 80 వేల దిగువకు పుత్తడి



న్యూఢిల్లీ, జనవరి 6: బంగారం ధరలు శాంతించాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర 80 వేల దిగువకు పడిపోయింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర సోమవారం ఒకేరోజు రూ.700 తగ్గి రూ.79 వేలకు తగ్గినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. కానీ, వెండి మాత్రం రూ.300 పెరిగి రూ.90,700గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా పెరిగి 2,659.60 డాలర్లకు చేరుకోగా, వెండి 30 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. వివిధ దేశాల్లోని కేంద్రబ్యాంకులు వ్యూహాత్మకంగా పసిడి నిల్వలను పెంచుకుంటున్నాయి. గతేడాది నవంబర్ నెలలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లు 53 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేశాయి. దీంట్లో రిజర్వుబ్యాంక్ 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను అధిగమించడానికి ఆయా సెంట్రల్ బ్యాంకులను పసిడి నిల్వలను పెంచుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయి.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం 10 వేల రూపాయల ఆర్థిక సాయం

కల్వకుర్తి జనవరి 6 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం కోట్ర గ్రామానికి చెందిన శాంపురి గణేష్, తాండ్ర గ్రామానికి చెందిన కేశ మల్ల రామ్ కోటి కుటుంబాలను సోమవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యం పరామర్శించారు.అనంతరం మృతి చెందిన రామకోటి తల్లి కి రూ"5000 రూపాయలు, అలాగే కోట్ర గ్రామానికి చెందిన మృతుడు గణేష్ భార్య శివనీలకు రూ"5000 రూపాయలను కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యం అందజేశారు.అంతకుముందు ఆసుపత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలను మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, సూర్యలత స్పిన్నింగ్ మిల్క్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు మనోహర్ రెడ్డి, మధు,మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య,తాండ్ర మాజీ సర్పంచ్ సుశీల తో కలిసి మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యం సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ యువకులు రోడ్డు ప్రమాదానికి గురై అర్థాంతరంగా మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## స్వయంభు: దశావతార, శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ఆది మహావిష్ణు దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు

### నేటి నుంచి స్వామివారి 9 వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో నేటి నుంచి స్వయంభు: దశావతార, శ్రీదేవి, భూదేవి, సహిత శ్రీ ఆదిమహావిష్ణు దేవస్థానంలో స్వామి వారి 9 వ వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు దేవాలయ రాజగోపుర, శిఖర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా త్రయాహికముగా శ్రీ పంచరాత్ర శాస్త్ర దివ్య ఆగమోక్త ప్రకారముగా స్థానచార్యులు, భాస్కర రాయని శ్రీనివాస్ శర్మ, బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి గార్ల ఆధ్వర్యంలో యజ్ఞ చార్య స్వాములు శ్రీ మాన్ సముద్రాల నరసింహ చార్యులు, శ్రీమన్ శేషం ప్రవీణ్ కుమార చార్య, స్వామివార్ల వేద పండితులచే వేదొక్తముగా నిర్వహించబడును.



## మార్కెట్లను ముంచిన వైరస్

### భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 1,258, నిఫ్టీ 388 పాయింట్ల పతనం

ముంబై, జనవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదుకావడంతో సూచీలు అమ్మకాలు ఒత్తిడికి గురయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కార్పొరేట్లు నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటంతోపాటు ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన బలహీన సంకేతాలకు తోడు, విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. వరుసగా రెండోరోజు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 78 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 1,441 పాయింట్లు నష్టపోయి 77,781 పాయింట్ల వద్దకు చేరుకున్న సూచీ చివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించింది. మార్కెట్ ముగిసే సమయానికి 1,258.12 పాయింట్లు లేదా 1.59 శాతం నష్టపోయి 77,964.99 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ కూడా 24 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 388.70 పాయింట్లు లేదా 1.62 శాతం నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో తొలిరోజే మదుపరుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రారంభించిన నిమిషాల్లోనే కంపెనీ షేర్లు అమ్ముడైపోగా, తొలిరోజు 13.32 రెట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలయ్యాయి. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 2,08,29,567 షేర్లను అమ్మకానికి పెట్టగా, వీటికి 27,75,00,862 షేర్ల బిడ్డింగ్ దాఖల్యయాయి. టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్‌లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లె, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, టాటామోటర్స్, మారుతి, ఎల్‌అండ్‌టీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి. కేవలం టైటాన్, హెచ్‌సీఎల్‌టెక్నాలజీ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. 3,474 సూచీలు నష్టపోగా, 656 సూచీలు లాభాల్లో ముగిశాయి. కేవలం 114 షేర్లు యథాతథంగా ట్రేడయ్యాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.17 శాతం, మిడ్‌క్యాప్ 2.44 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే యుటిలిటీ అత్యధికంగా 4.16 శాతం నష్టపోగా, పవర్ 3.73 శాతం, సర్వీసెస్ 3.45 శాతం, మెటల్ 3.15 శాతం, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3.15 శాతం, ఎనర్జీ 3.03 శాతం, ఇండస్ట్రియల్స్ 2.97 శాతం, కమోడిటీస్ 2.74 శాతం చొప్పున పతనం చెందాయి. ఎఫ్‌ఐఐలు రూ.2,575 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.